ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 2 | సంచిక: 298 | పేజీలు: 4 | వెల: రూ.3/- | బుధవారం 5 ఫిబ్రవరి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# కులగణన సర్వేపై సభలో వాడీవేడి చర్చ

**బీసీలకు పథకాల్లో లబ్ది చేకూర్చాలన్నదే లక్ష్యం**
**పార్టీ పరంగా స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తాం**
**విపక్ష పార్టీలు ఇందుకు సిద్దంగా ఉన్నాయా చెప్పాలి**
**దేశంలోనే తొలిసారిగా కులగణన సర్వే చేపట్టాం**
**నివేదికను అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన సీఎం రేవంత్ రెడ్డి**
**కులగణన సర్వేపై రాజకీయాలు చేయొద్దన్న మంత్రి పొన్నం**



**హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ప్రభాత ఉదయం):** బిసి కులగణన సర్వేపై తెలంగాణ అసెంబ్లీలో వాడీ వేడి చర్చ జరిగింది. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు చేసిన ఆరోపణలను సీఎం రేవంత్‌రెడ్డి తిప్పికొట్టారు. భారాస నేతలు సర్వేలో ఎందుకు పాల్గొనలేదని నిలదీశారు. ఇలా పాల్గొనని నేతలకు సభలో మాట్లాడే అర్హత లేదన్నారు. వారికి మైక్ ఇవ్వొద్దని స్పీకర్‌ను కోరారు. 'కులగణన సర్వే 50 రోజులు జరిగితే .. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు పద్మారావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మహబూబ్‌నగర్ భాజపా ఎంపీ డీకే అరుణ సర్వేలో పాల్గొనలేదు. సర్వేలో భూమి వివరాలు చెప్పాలని ఫామ్‌లో ఒక కాలమ్ ఉంటే.. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఎవరూ సమాచారం ఇవ్వలేదు. 3.54 కోట్ల మంది సర్వేలో పాల్గొంటే.. ఎమ్మెల్యేలు, ఎంపీలు అందరూ భూముల వివరాలు ఇచ్చారు. కానీ, భూముల వివరాలు అడగ్గానే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు భయపడి సర్వేలో పాల్గొనలేదు' అని అన్నారు. గత ప్రభుత్వం సమగ్రసర్వే నివేదికను ఎందుకు బయటపెట్టలేదోచెప్పాలన్నారు. దానిని పబ్లిక్డొమైన్‌లో ఎందుకు పెట్టలేదన్నారు. ఆనాడు అధికారికంగా అసెంబ్లో ఎందుకు పెట్టలేదని బిఆర్‌ఎస్‌ను నిలదీసారు. ఇదే సందర్భంలో రిజర్వేషన్లకు రాజ్యాంగ సవరణ అవసరం కనుక అసెంబ్లీలో తీర్మానం చేసినా లాభం లేదన్నారు. అందుకే పార్టీ పరంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పక్షాన బీసీలకు 42శాతం సీట్లు ఇస్తాం అని ప్రకటించారు. అన్ని పార్టీలు దీనికి ..మిగతా 2లో



## కులగణనకు కేబినేట్ ఆమోదం

**అన్ని రాష్ట్రాల్లో ఈ డిమాండ్ వస్తుందని వెల్లడి**
**ఫిరాయింపుదారులకు నోటీసులు రొటీన్ ప్రాసెస్.. కేటినేట్ భేటీలో సీఎం రేవంత్**

**హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ప్రభాత ఉదయం):** తెలంగాణలో ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ అవడం హాట్ టాపిక్‌గా మారింది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన 10 మంది ఎమ్మెల్యేలకు అసెంబ్లీ కార్యదర్శి నోటీసులు జారీ చేశారు. ఫిరాయింపు మీద లిఖిత పూర్వక సమాధానం ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. తాజాగా ఈ వివాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ప్రొసీజర్‌లో భాగంగానే ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ అయ్యాయని తెలిపారు. సమగ్ర కులగణన, ఎస్సీ వర్గీకరణ నివేదికలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా క్యాబినేట్ భేటీలో ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. ఈ రోజు దేశ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఈ నిర్ణయంతో ప్రధాని మీద ఒత్తిడి పెరుగుతుందన్నారు. అన్ని రాష్ట్రాల్లో కులగణన చేయాలనే డిమాండ్ రానుందన్నారు. భవిష్యత్తులో ఈ రోజు తాము ప్రవేశపెట్టే డాక్యుమెంట్ రిఫరెన్స్ తీసుకోవాలన్నారు. 2011 జనాభా లెక్కల తర్వాత మళ్లీ తామే చేశామన్నారు. 2014 లెక్కలు ఎక్కడ ఉన్నాయో చేసిన వాళ్లే చెప్పాలన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం కులగణన చేయడం లేదన్నారు. కులగణన వల్ల 76 శాతం బీసీ, ఎస్సీ, మైనార్టీలకు న్యాయం జరుగుతుందన్నారు. కులగణన చేసి చరిత్ర సృష్టించామన్నారు. పకడ్బందీగా సర్వే చేసి సమాచారం సేకరించామని చెప్పారు. ప్రధాన ప్రతిపక్షానికి బాధ్యత లేదని ముఖ్యమంత్రి సీరియస్ అయ్యారు. బీఆర్ఎస్‌ను తాము పరిగణనలోకి తీసుకోవడం లేదన్నారు. ప్రతిపక్ష నేత సభకు రావాలి కదా అని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల మీదా ఆయన రియాక్ట్ అయ్యారు. కోర్టు ఆదేశాలతో బీసీ రిజర్వేషన్లపై కమిషన్ వేశామన్నారు. కోర్టు ఆదేశాల మేరకు కమిషన్ డెసిషన్ తీసుకుంటుందని పేర్కొన్నారు.

# వికసిత భారత్ మా దృఢసంకల్పం

**ఆ లక్ష్యం దిశగా పయనిస్తున్నాం**
**రాష్ట్రపతి ప్రసంగంలో ఇదే స్పష్టం చేశాం**
**రాబోయే 25 ఏళ్ల కాలానికి ప్రజల్లో విశ్వాసం పాదుకొల్పాం**
**తప్పుడు హామీలతో ప్రజలను మోసం చేయడం లేదు**
**కొందరు సెల్ఫీలు దిగుతూ..అద్దాల మేడల్లో ఉంటారు**
**ప్రతి రూపాయి గ్రామానికి చేరుకునేలా చూస్తున్నాం**
**రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానానికి మోదీ సమాధానం**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4 (ప్రభాత ఉదయం):** రాష్ట్రపతి ప్రసంగం 'వికసిత్ భారత్' లక్ష్యంపై దేశ దృఢసంకల్పాన్ని పునరుద్ఘాటించిందని ప్రధాని మోడీ అన్నారు. రాష్ట్రపతి ప్రసంగం తమలో ఆత్మవిశ్వాసం నింపిందని, మరోసారి తమ ప్రభుత్వాన్ని ఎన్నుకున్నందుకు ప్రజలకు కృతజ్ఞతలని చెప్పారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానానికి పధ్నాలుగు సార్లు సమాధానం ఇచ్చే అదృష్టాన్ని దేశ ప్రజలు తనకు ఇచ్చారని, ఇందుకు తాను ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. పార్లమెంటులో రాష్ట్రపతి చేసిన ప్రసంగంపై ధన్యవాద తీర్మానానికి లోక్‌సభలో ప్రధాని సమాధానమిస్తూ, 'మనం 2025లో ఉన్నారు. ఒకరకంగా 21వ శతాబ్దంలో 25 శాతం ముగిసిపోయింది. 20వ శతాబ్దంలో స్వాతంత్ర్యం తరువాత, 21వ శతాబ్దంలో 25 ఏళ్లలో ఏం జరిగిందనేది కాలమే చెబుతుంది. రాష్ట్రపతి ప్రసంగాన్ని జాగ్రత్తగా గమనిస్తే, రాబోయే 25 ఏళ్లలో, వికసిత్ భారత్ దిశగా ప్రజల్లో విశ్వాసం పాదుకొలపే దిశగా పనిచేయనున్నాం. వికసిత్ భారత్ లక్ష్యాన్ని రాష్ట్రపతి ప్రసంగం ప్రతిబింబించింది. సరికొత్త ధీమాను కల్పిస్తూ, సామాన్య ప్రజానీకానికి స్ఫూర్తిగా నిలిచిందని మోదీ అన్నారు. 'గరీబీ హటోవా' నినాదంపై మాట్లాడుతూ. ప్రభుత్వం తప్పుడు హామీలు ఇవ్వదని, ప్రజలకు నిజమైన అభివృద్ధిని అందిస్తుందని ప్రధాని అన్నారు. ఇంతవరకూ పేదలుకు 4 లక్షల గృహాలు ఇచ్చామని, గతంలో మహిళలు బహిర్భూమి సిస్టమ్ లేక అవస్థలు పడవారని, ఎవరైతే అన్ని సౌకర్యాలు ఉన్నారో వారికి ఇలాంటి అవసరాలు అర్థం కావని పరోక్షంగా ప్రతిపక్ష కాంగ్రెస్‌కు చురకలు వేశారు. పేదల కోసం 12 కోట్లకు పైగా మరుగుదొడ్లు నిర్మించామని అన్నారు. గత ఐదు దశాబ్దాలుగా 2కోట్ల మంది ప్రజలను పేదరికం నుంచి బయటపడేశామని చెప్పారు. అంకితభావంతో పథకాలు అమలు చేసినప్పుడే ఇలాంటి మార్పు సంభవమని అన్నారు. పేదల గురించి ఉత్తుత్తి హామీలు తాము ఇవ్వమని, అభివృద్ధి చేసి చూపిస్తామని ..మిగతా 2లో

## కులగణన సర్వేల లెక్కల్లో పొంతన లేదు

**జనాభాను తక్కువ చేసి చూపారన్న విపక్షాలు**
**సర్వే తీర్మానంతో సరిపోదన్న బీఆర్ఎస్, బీజేపీ**
**సమగ్రత లేదన్న శ్రీనివాసయాదవ్, పాయల శంకర్**




**హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ప్రభాత ఉదయం):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రవేశపెట్టిన కులగణన సర్వేపై వాడివేడి చర్చ జరిగింది. కులగణన సర్వే నివేదికలో పొందుపర్చిన అంశాలపై భాజపా ఎమ్మెల్యే పాయల్ శంకర్, భారాస ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పలు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కులగణన సర్వేపై కొన్ని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని భారాస నేత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. 'గత 15 ఏళ్లలో బీసీ జనాభా అంతగా పెరగలేదని, ఎస్సీ, ముస్లింల జనాభా తగ్గినట్లు సర్వే నివేదిక చెబుతోంది. జీహెచ్ఎంసీలో 30 శాతం కూడా సర్వేలో పాల్గొనలేదు. అంతేకాకుండా చాలామంది వివరాలు చెప్పలేదు. కేవలం సర్వే చేయించి, తీర్మానం చేస్తే సరిపోదు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు చట్టబద్ధత కల్పించాలి. ఏ కులం జనాభా ఎంతో ప్రభుత్వం వెల్లడించాలి. సర్వేలో 56 అంశాలు ప్రస్తావించారు. అందుకే చాలా మంది వివరాలు చెప్పలేదు. ఫార్మాట్ మార్చి మరోసారి సర్వే చేయించాలి. సర్వే నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని తలసాని కోరారు. ఎన్నికల సమయంలో మాత్రమే ..మిగతా 2లో

# నేడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు

**పకడ్బందీ ఏర్పాట్లు చేసిన ఎన్నికల సంఘం**
**హ్యాట్రిక్ విజయం సాధించాలని ఆప్ పోరాటం**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4 (ప్రభాత ఉదయం):** బుధవారం ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో పోలింగ్ నిర్వహించనున్నారు. ఢిల్లీ ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. ఢిల్లీలోని 70 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని మొత్తం 1.56 కోట్ల మంది ఓటర్లు బుధవారం తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. ఢిల్లీలోని 70 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని మొత్తం 1.56 కోట్ల మంది ఓటర్లు రేపు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. బుధవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. ఫిబ్రవరి 8న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు. మొత్తం ఎన్నికల ప్రక్రియ ఫిబ్రవరి 10 తో ముగియనుంది. ఢిల్లీలోని 70 నియోజకవర్గాల్లో 58 జనరల్ సీట్లు కాగా.. మరో 12 ఎస్సీ రిజర్వ్‌డ్ సీట్లు. మొత్తం 1.56 కోట్ల మంది ఓటర్లలో 83.49 లక్షల మంది పురుష ఓటర్లు కాగా.. 71.74 లక్షల మంది మహిళా ఓటర్లు ఉన్నారు. వారిలో 20 నుంచి 29 ఏళ్ల వయస్సు గల యువ ఓటర్ల సంఖ్య 25.89 లక్షలుగా ఉంది. 18 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల తొలిసారి ఓటేసే వారి సంఖ్య 2.08 లక్షలు. ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక అవసరాలు ఉన్న వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు అధికారులు ప్రకటించారు. పీడబ్ల్యూడీ వర్గం నుంచి 79,430 మంది ఓటర్లు ఉన్నారు. ఇక 100 సంవత్సరాలు దాటిన ఓటర్ల సంఖ్య 830 గా ఉంది. 85 ఏళ్ల వయస్సు దాటిన ఓటర్లు 1.09 లక్షల మంది ఉన్నారు.



## కులగణన సర్వేలో పాల్గొనని అధికార పార్టీ నేతలు

**భూముల వివరాలు ఇవ్వాల్సి వస్తుందని బాయ్‌కాట్**
**అసెంబ్లీలో సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ప్రభాత ఉదయం):** కులగణన, ఎస్సీ వర్గీకవరణపై తెలంగాణ అసెంబ్లీలో చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. సామాజిక కులగణన సర్వేలో అనేక మంది ప్రముఖులు పాల్గొనలేదని అసెంబ్లీలో తెలిపారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకం ఇంటింటి సర్వే చేస్తే కొందరు ప్రముఖులు ఈ సర్వేలో పాల్గొనలేదన్నారు. సర్వేలో పాల్గొనని వారు ఎవరెవరో పేర్లతో సహా సభ ముందు పెట్టారు సీఎం. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు, మాజీ మంత్రులు కల్వకుంట్ల తారకరామారావు, తన్నీరు హరీష్ రావు, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ..మిగతా 2లో



## వ్యవసాయ ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

### డీఏఓ సక్రియా నాయక్ .. ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

గద్వాల, ఫిబ్రవరి 04(ప్రభాత ఉదయం) కేటిదొడ్డి మండలంలోని పాగుంటా, కొండాపురం, కుచినెర్ల, చింతలకుంట, నందిన్నె గ్రామాలలోని ఎరువుల దుకాణాలను మంగళవారం డీఏఓ సక్రియా నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశా రు. రైతులు ఎరువులు కొనుగోలు చేసిన సమయంలో విధిగా బిల్లులు ఇవ్వాలని, దుకాణాల ఎదుట ధరల పట్టిక ఏర్పాటు చేయాలని దుకాణాల నిర్వాహకులకు సూచించారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు స్టాక్ నిల్వలను పరిశీలించారు. అనంతరం ఇన్వాయిస్ స్టాక్ రిజిస్టర్, బిల్‌బుక్కులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఏఓ సక్రియా నాయక్ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు సరసమైన ధరలకు ఇవ్వాలని అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కొనుగోలు చేసిన రైతులకు తక్షణమే బిల్లు ఇవ్వాలని సూచించారు. డీలర్లు స్టాక్ అమ్మిన వెంటనే తప్పనిసరిగా బిల్లులను రైతులకు ఇవ్వాలన్నారు డిఏఓ వెంటా ఏఈఓలు, తదితరులు ఉన్నారు.



## ఘనంగా శ్రీ మాతా యోగా అన్నపూర్ణేశ్వరి 25వ వార్షిక మహోత్సవం

### ప్రత్యేక పూజలు నిర్వహించిన తెలంగాణ చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 4 (ప్రభాత ఉదయం) కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజులరామారం డివిజన్ పరిధి మహాదేవపురంలో గల శ్రీ మాతా యోగా అన్నపూర్ణేశ్వరి 25వ వార్షిక మహోత్సవాలు జగన్ గురూజీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలకు జగన్ గురువు ఆహ్వానం మేరకు కూకట్ పల్లి నియోజకవర్గ సీనియర్ నాయకుడు దేశాలు ఆధ్వర్యంలో తెలంగాణ చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో కలకాలం వర్ధిల్లాలని పట్నం మహేందర్ రెడ్డి కొనియాడారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి, బి సంజీవరావు, మేకల మైకల్, భీమ్ రావు, రేష్మ, తమ్మినేని ప్రవీణ్ కుమార్, కే బాబు, రాజుముదిరాజ్, శ్రీధర్ చారి, రామకృష్ణారెడ్డి, గిరి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



పథకాలు సాధించిన సిబ్బందితో ఎస్పీ శ్రీనివాసరావు

## 3వ తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్-2025 లో పతకాలు సాధించిన జిల్లా పోలీస్ సిబ్బంది

### అభినందించిన జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి4(ప్రభాత ఉదయం)కరీంనగర్‌లో జనవరి 28 నుండి ఫిబ్రవరి 1 వరకు జరిగిన 3వ తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్-2025 క్రీడాల్లో జిల్లాకి చెందిన క్రీడాకారులు 02 బంగారు పతకాలు, 01-కాంస్యం పతకం సాధించారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన పోలీస్ క్రీడాకారులు మంగళవారం జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు ను జిల్లా ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ.. జిల్లా, జోనల్ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించినందుకు ముందుగా క్రీడాకారులకు అభినందనలు తెలియజేశారు.ఇదే స్ఫూర్తిని కనబరుస్తూ రాబోయే రోజుల్లో జాతీయస్థాయిలో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. తైక్వాండో అండర్ 87 కేజీల విభాగంలో రామాంజనేయులు (కానిస్టేబుల్) గోల్డ్ మెడల్ సాధించగ, తైక్వాండో 68 కేజీల విభాగం లో యు. రవి కుమార్ (కానిస్టేబుల్)-గోల్డ్ మెడల్ సాధించారు. స్విమ్మింగ్ లో వీర ప్రతాప్ రెడ్డి (సాయుధ దళ కానిస్టేబుల్) కాంస్య పతకం సాధించాదు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏ . ఓ సతీష్ కుమార్, ఆర్.ఐ వెంకటేష్ పాల్గొన్నారు.

## వికసిత భారత్ మా దృఢసంకల్పం

మొదటి పేజీ తరువాయి...

చెప్పారు. పేదలు, సామాన్య ప్రజలు, మధ్యతరగతి సవాళ్లను అవగాహన చేసుకుని, వాటిని అధిగమించేలా చేసేందుకు కట్టుబడి ఉంటామని చెప్పారు. 'ప్రజల సొమ్ము ప్రజల చేతికే' అనేది మా నినాదం. డిజిటల్ సాంకేతికత ద్వారా పారదర్శకత పెంచాం. పది కోట్ల నకిలీ ఖాతాలను గుర్తించి తొలగించాం. ఇథనాల్ బ్లెండింగ్ ద్వారా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేశాం. గతంలో తరచూ రూ.లక్షల కోట్ల అవినీతిపై రోజూ వార్తలు వచ్చేవి. గత పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలే లేవు. మా హయాంలో మౌలిక వసతుల కల్పనపై భారీగా వెచ్చించాం. కేంద్రంలో పదేళ్లుగా అవినీతి లేకపోవడంతో జనం లాభపడ్డారు. ఆయుష్మాన్ భారత్, జన్ ఔషధి కేంద్రాల ఏర్పాటుతో రోగులకు ఎంతో మేలు జరిగిందన్నారు. మా హయాంలో ప్రతి రూపాయిని ప్రజల కోసమే ఖర్చు చేస్తున్నాం. ప్రజల డబ్బును మేం అద్దాల మేడలు నిర్మించడానికి ఉపయోగించలేదు.. దేశాభివృద్ధికి వినియోగించాం. ప్రపంచ గేమింగ్ రాజధానిగా భారత్ తయారవుతోంది. మే అధికారంలోకి రాకముందు ఎల్ఈడీ బల్బు ధర రూ.400 ఉండేది. మా ప్రభుత్వం రాగానే ఎల్ఈడీ బల్బును రూ.40కే పంపిణీ చేశాం. దీని ద్వారా దేశ ప్రజలకు రూ.20వేల కోట్లు ఆదా అయింది. మా పాలన బాగుండటం వల్లే మళ్లీ గెలుస్తున్నాం. హరియాణాలో మూడోసారి అధికారంలోకి వచ్చాం. మహారాష్ట్రలోనూ తిరిగి అధికారంలోకి వచ్చాం'అని ప్రధాని వివరించారు. అలాగే ప్రధాని తన ప్రసంగంలో రాహుల్ గాంధీ, కేజ్రీవాల్‌పై పరోక్ష విమర్శలు గుప్పించారు. రాష్ట్రపతి ప్రసంగం బోరింగ్‌గా ఉందంటూ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను పరోక్షను ప్రస్తావిస్తూ, పేదల గుడిసెల్లో ఫోటో సెషన్లతో సరదాగా గడిపేవారికి పార్లమెంటులో పేదల గురించి మాట్లాడుతూ చేసే ప్రసంగాలు బోర్‌గానే ఉంటాయని అన్నారు.

## నేడు మెట్టినింటికి రానున్న నడిగడ్డ ప్రజల

# ఆరాధ్య దైవం జమ్ములమ్మ అమ్మవారు



అమ్మవారిని ఊరేగింపుగా తీసుకు వస్తున్న ఆలయ కమిటీ ఈవో పురేందర్, కమిటీ ప్రతినిధులు..



అమ్మవారిని దర్శించుకోవటానికి తరలివచ్చిన భక్తులు

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి4(ప్రభాత ఉదయం) నడిగడ్డ ప్రజల ఇలవేల్పు శ్రీజమ్ములమ్మ పరుశరాముడు స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా జమ్ములమ్మ అమ్మవారిని పుట్టినిల్లు అయిన గుర్రంగడ్డ నుంచి తీసుకొచ్చేందుకు మంగళవారం ఎద్దుల బండి గుడ్డం గడ్డకు బయలుదేరి వెళ్లింది. అంతకుముందు అమ్మవారికి శ్రీజమ్ములమ్మ పరుశరాముడుస్వామి ఆలయ చైర్మన్ ఎం.వెంకట్రాములు, ఆలయ ఈఓ పురేందర్, ఆలయ కమిటి సభ్యులు, నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం తరపున సారెను సిద్ధం చేసుకొని, బాజా భజంత్రీల నడుమ ఎద్దుల బండి వరకు తీసుకెళ్లారు. అక్కడ నుంచి ఎద్దుల బండి జమ్మిచేడు, లత్తిపురం, బీరోలు మీదుగా సాయంత్రం గుర్రంగడ్డకు చేరుకున్నది. అక్కడ విశేష పూజల అనంతరం బుధవారం తెల్లవారుజామున జమ్మిచేడుకు అమ్మవారిని తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేసి అమ్మ వారి బండికి ఆహ్వానం పలుకుతారు. అక్కడి నుంచి కళాకారుల ప్రదర్శనలు, పోతురాజుల విన్యా సాలు, శివసత్తుల పూనకాల నడుమ ఊరేగింపు ప్రారంభమవుతుంది. ఆ తర్వాత అమ్మవారిని జమ్ములమ్మ ఆలయానికి చేరుస్తారు. అనంతరం అర్చకులు ప్రత్యేక పూజలు చేస్తారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. జమ్ములమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ నిర్వాహణ అధికారి పురేందర్ తెలిపారు. ఈనెల 12న పౌర్ణమి సందర్భంగా శ్రీజమ్ములమ్మ , పరుశరాముడు స్వామి జాతర ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ప్రతి మంగళవారం, శుక్రవారం జమ్ములమ్మ అమ్మ వారి భక్తులు అమ్మవారిని దర్శించుకుని నైవేధ్యం సమర్పించి తమ మొక్కులు చెల్లించుకుంటారు. సుమారు 6నెలల పాటు శ్రీ జమ్ములమ్మ అమ్మవారి ఉత్సవాలు జరుపుకోవడం నడిగడ్డలో ఆనవాయితీగా కొనసాగుతోంది.

### జమ్ములమ్మకు పోటెత్తిన భక్తులు

గద్వాల పట్టణ పరిధిలోని శ్రీజములమ్మ అమ్మవారిని దర్శించుకోవడానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. గర్భాలయంలో ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకొని భక్తులు పరవశించారు. బైనోళ్లు, కుర్వల డోలు చప్పుళ్లు, శివసత్తుల పూనకాల నడుమ, జములమ్మ కరుణించ వమ్మా అంటూ భక్తులు అమ్మవారిని కొలిచారు. జమ్ములమ్మ బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ క్షేత్రం కిక్కిరిసింది. వేలాది మంది భక్తులు తరలిరావడంతో పరిసర ప్రాంతాలు రద్దీగా మారాయి.. ఆలయ గదులతో పాటు పరిసరాలలో షామియాలను వేసుకొని నైవేద్యాన్ని సిద్ధం చేసుకొని అమ్మవారికి సమర్పించారు. చీర, రవికతో పాటు వెండి పాదాలు, కడియాలు, బియ్యాన్ని అమ్మవారికి అర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.



కొలువు దిగిన జములమ్మ అమ్మవారు

## కులగణన సర్వేలో పాల్గొనని అధికార పార్టీ నేతలు

మొదటి పేజీ తరువాయి...

సర్వేలో పాల్గొనలేదని అన్నారు. ఇదే విషయంపై పలువురిని అడిగితే 'నువ్వు ఇచ్చిన సర్వేలో ఐదో పేజీలో భూమి వివరాలు అడిగాం. ఒక్క దెబ్బకు ఎవరూ సమాచారం ఇవ్వలేదు' అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. మూడు కోట్ల 54 లక్షల మంది సర్వేలో పాల్గొంటే ఇక్కడున్న ఎమ్మెల్యేలు, మంత్రులంతా వివరాలు ఇచ్చారని తెలిపారు. కానీ భూముల వివరాలు అడిగినందుకే కొందరు సర్వేలో పాల్గొనకపోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇంత ముఖ్యమైన చర్చలో తప్పుడు నివేదకలు తీసుకువచ్చి రచ్చ చేస్తున్నారని మండిపడ్డారు. మేము చెప్పిన ప్రకారం 15 శాతం ఓసీలు ఉంటే, ఓసీలు 21శాతం అంటూ తప్పుడు లెక్కలు చెబుతున్నారన్నారు. సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం బీసీ జనాభా 51 శాతం అని.. మేం చేసిన సర్వే ప్రకారం బీసీ జనాభా 56 శాతంగా ఉందన్నారు. సర్వేపై అపోహలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. పాయల్ శంకర్ అపోహలు సృష్టించేలా మాట్లాడుతున్నారని వ్యాఖ్యలు చేశారు. 1930 నుంచి ప్రతీ పది సంవత్సరాలకు జనాభా లెక్కలు చేశారని తెలిపారు. 2014లో నరేంద్ర మోదీ ప్రధానిగా బాధ్యత స్వీకరించక ఈరోజు వరకు జనాభా లెక్కలు చేయడం లేదని అన్నారు. బలహీన వర్గాలకు వారి హక్కులు ఇవ్వడం బీజేపీ ఇష్టం లేని కారణంగా జనాభా లెక్కలు చేయడం లేదని విమర్శించారు. స్వాతంత్యం వచ్చాక 70 సంవత్సరాలు కొనసాగిన జనాభా లెక్కల పక్రియ మోదీ ప్రధాని అయ్యాక ఎందుకు జరగడం లేదని నిలదీశారు. 2024లో చేపట్టిన ఈ లెక్కలే.. అధికారిక లెక్కలని స్పష్టం చేశారు. ప్రభుత్వం అధికారికంగా సేకరిస్తున్న సమాచారాన్ని ప్రజాప్రతినిధులుగా ఉండే పక్కదారి పట్టించి... వివరాలు ఇవ్వకుండా సభలో తప్పుడు లెక్కలు చూపుతున్నారని మండిపడ్డారు. సర్వలో పాల్గొనని ఎమ్మెల్యేలు సర్వేలో పాల్గొని వివరాలు ఇవ్వాలన్నారు. ఇన్ని సంవత్సరాలు ఆలస్యమైనప్పటికీ ఇప్పటికైనా బలహీన వర్గాల కోసం పనిచేద్దామని అన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## కులగణన సర్వేల లెక్కల్లో పొంతన లేదు

మొదటి పేజీ తరువాయి...

రాజకీయ పార్టీలకు బీసీలు గుర్తుకు వస్తున్నారని భాజపా ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఓట్లు పొందేందుకే బీసీ నినాదం అందుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వం చెబుతున్న లెక్కలు, రాష్ట్ర జనాభా సంఖ్యకు పొంతన లేదన్నారు. 'ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభా 4.33 కోట్లు అని తెలుస్తోంది. కులగణన సర్వే ప్రకారం రాష్ట్ర జనాభా 3.76 కోట్లుగా తెలుస్తోంది. టికెట్ల కేటాయింపు దగ్గర నుంచే బీసీలకు అన్యాయం జరుగుతోంది. జనాభా ప్రకారం బీసీలకు సగం సీట్లు ఇస్తామని రాజకీయ పార్టీలు చెబుతున్నాయి. గెలుపు అవకాశాలు లేని స్థానాలకు బీసీలను పరిమితం చేస్తున్నారు. కులసంఘాల భవనాలకు స్థలం కేటాయింపులోనూ బీసీలకు అన్యాయం జరుగుతోంది. హైదరాబాద్‌కు 60 కిలోమీటర్ల దూరంలో బీసీ సంఘాల భవనాలకు స్థలం కేటాయిస్తున్నారు. అగ్రవర్ణాల వారి కులసంఘాల భవనాలకు మాత్రం జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో కేటాయించారు. బలహీనవర్గాల విషయంలో కేవలం తీర్మానాలు చేసి వదిలేస్తున్నారు. ఈ సర్వేలో హిందూ బీసీలు, ముస్లిం బీసీలు అని కొత్త పదాలు సృష్టించారు. కోర్టుల్లో కేసులు వేసి బీసీలకు రిజర్వేషన్ల పెంపును జాప్యం చేయాలని చూస్తున్నారు. కోర్టుల పేరు చెప్పి ప్రభుత్వం బీసీల రిజర్వేషన్ల పెంపును పక్కకు పెడుతోంది' అని ఆరోపించారు.

## కులగణన సర్వేపై సభలో వాడీవేడి చర్చ

మొదటి పేజీ తరువాయి...

కట్టుబడి ఉంటాయా అని ప్రశ్నించారు. రాజకీయాల్లో బీసీలకు మేం 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తాం. ఈ మేరకు పీసీసీ అధ్యక్షుడి నుంచి మాట తీసుకున్నా. అన్ని పార్టీలు బీసీలకు 42శాతం సీట్లు ఇవ్వాలి. కులగణన సర్వే డేటాను సంక్షేమ పథకాల విధానాల తయారీకి వాడతాం. 1931 నుంచి ప్రతి పదేళ్లకు ఓసారి జనగణన చేపట్టారు. 2014లో నరేంద్రమోదీ ప్రధాని అయిన తర్వాత ఇప్పటివరకు జనగణన జరగలేదు. 2021 నుంచి ఇప్పటి వరకు సర్వే చేయకుండా వదిలేశారు. దీనిపై బిజెపి నేతలు ప్రధాని మోడీపై ఎందుకు ఒత్తిడి చేయడం లేదన్నారు. బలహీనవర్గాలకు వారి హక్కులు ఇవ్వడం భాజపాకు ఇష్టం లేదు. ప్రధాని మోదీ .. బలహీనవర్గాలకు ఏదైనా సాయం చేయాలనుకుంటే 2021లో లెక్కించాల్సిన జనాభాను ఇంతవరకు ఎందుకు చేయలేదని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. సామాజిక, ఆర్థిక, ఉపాధి, విద్య, రాజకీయ, కులగణన సర్వే నివేదికను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా నివేదికలోని అంశాలను సీఎం వివరించారు. 'రాష్ట్రంలో సమగ్ర ఇంటింటి కులగణన సర్వే చేయాలని ఫిబ్రవరి 2024లో నిర్ణయం తీసుకున్నాం. కర్ణాటక, బిహార్ సహా వివిధ రాష్ట్రాల్లో జరిగిన సర్వేలను క్షుణ్ణంగా అధ్యయనం చేశాం. సర్వే నిర్వహించే విధానాలపై వివిధ సంఘాలు, మేధావుల అభిప్రాయాలు తీసుకున్నాం. దాదాపు 50 రోజుల పాటు సర్వే జరిగింది. గ్రామాల్లో 66.39 లక్షల కుటుంబాలు, పట్టణాల్లో 45.15 లక్షల కుటుంబాల్లో సర్వే నిర్వహించాం. రాష్ట్రంలో మొత్తంగా 1.12 కోట్ల కుటుంబాల వివరాలు సర్వే చేశాం. సర్వే ప్రకారం ఎస్సీలు 61,84,319 (17.43 శాతం), బీసీలు (ముస్లిం మైనారిటీ మినహా) 1,64,09,179 (46.25 శాతం), ఎస్టీలు 37,05,929 (10.45 శాతం), ముస్లిం మైనారిటీలు 44,57,012 (12.56 శాతం) మంది ఉన్నారు. ఈ నివేదికను సంక్షేమ విధానాల తయారీకి వినియోగిస్తాం.జనగణన కంటే పకడ్బందీగా కులగణన చేశాం. రాష్ట్రంలో ఉన్న ప్రతి ఇంటికీ స్టిక్కర్ అంటించాం. ఒక ఎన్యుమరేటర్ రోజుకు 10 ఇళ్లకంటే ఎక్కువ ఇళ్లలో సర్వే చేయలేదు. 8 పేజీలతో ఉన్న ప్రశ్నపత్రంలో సమగ్ర వివరాలు నమోదు చేశాం. 76 వేల మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు 36 రోజుల పాటు పనిచేసి డేటా క్రోడీకరించారు. మొత్తంగా రూ. 125 కోట్లు ఖర్చు చేసి సర్వే ద్వారా సమగ్ర వివరాలు సేకరించాం. మేం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే సర్వే చేయించాం' అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. సర్వే ఆధారంగా ఆయా కులాల వారికి న్యాయం చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ సర్వే దేశానికే దిక్సూచిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. 'భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాలకు ఈ సర్వే రోడ్‌మ్యాప్‌లా పనిచేస్తుంది. భావితరాలకు న్యాయం చేయడానికి సమగ్రంగా వివరాలు సేకరించాం. బలహీనవర్గాలకు న్యాయం చేయాలనే చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి ఉంది. బీసీలకు న్యాయం చేసేందుకు చేపట్టాల్సిన పథకాలపై విపక్షాలు సూచనలు చేయాలి' అని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. అంతకుముందు సమగ్ర కులగణన, ఎస్సీ వర్గీకరణ నివేదికలకు తెలంగాణ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన అసెంబ్లీ హాల్లో సుమారు 2 గంటలపాటు క్యాబినెట్ భేటీ కొనసాగింది. ఈ నివేదికలను మధ్యాహ్నం 2 గంటలకు అసెంబ్లీలో ప్రవేశపెట్టారు.

## రాష్ట్ర స్థాయిలో ప్రతిభచాటిన అక్షర కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థి విద్యార్థిని చుక్క లక్ష్మీ ప్రణిత



గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి4(ప్రభాత ఉదయం)భారతదేశం అంతటా ఉన్న పాఠశాలలో నూతన యుగ నైపుణ్యాలతో కూడిన భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న విద్యార్థులను పెంపొందించడానికి సాధికారత కల్పించడమే లక్ష్యంగా స్థాపించిన ఉ లో(%ఖుూూ%) ఆధ్వర్యంలో కాన్వథాన్ 2024 లో వివిధ అంశాలపై నిర్వహించిన పోస్టర్ డిజైన్ కంటెస్ట్ పోటీలలో గద్వాల పట్టణం అక్షర కాన్సెప్ట్ స్కూల్ ఎనిమిదవ తరగతి విద్యార్థిని చుక్క లక్ష్మీ ప్రణిత రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరించింది. ఏఐ టెక్నాలజీ, పరిశుభ్రమైన, అందమైన పొరుగు ప్రాంతాన్ని సాధించడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు అనే అంశాలపై ఉలో యాప్ వారు రాష్ట్రంలో ని పలు పాఠశాల విద్యార్థులకు ఆన్ లైన్ పోస్టర్ డిజైన్ కంటెస్ట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గద్వాలలోని అక్షర కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థిని చుక్క లక్ష్మీ ప్రణిత పరిసరలా పరిశుభ్రత, పర్యావరణ కాలుష్యం, ప్లాస్టిక్ రహిత సమాజం, ఇతర అంశాలపై ఆన్ లైన్ యాప్ ద్వారా పోస్టర్ డిజైన్ చేసి పొందుపరిచారు. దీనికి గాను రాష్ట్ర స్థాయిలో ప్రతిభకనబరిచి మొదటిస్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శ్రీధర్, డైరెక్టర్ హరిత, ప్రిన్సిపల్ రత్నం, ఉపాద్యాయులు విద్యార్థిని అభినందించారు.

## జిల్లాలో పలువురు తహసీల్దార్లకు బదిలీలు

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి4(ప్రభాత ఉదయం) సాధారణ బదిలీలో భాగంగా జిల్లాలో భారీగా తహసీల్దార్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు తహసీల్దార్లను బదిలీ చేస్తూ సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ వి.లక్ష్మీనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కలెక్టరేట్ లో ఏఓ గా విధులు నిర్వహిస్తున్న ఎస్.వీరభద్రప్ప ఇటిక్యాల మండలం తహసీల్దార్ గా బదిలీ అయ్యారు. అక్కడ పని చేస్తున్న ఇటిక్యాల తహసీల్దార్ బి.నరేందర్ కలెక్టరేట్ ఏఓగా బదిలీ పై వచ్చారు. కలెక్టరేట్ లో ని ఇ సెక్షన్ సూపరింటెండెంట్ గా విధులు నిర్వహిస్తున్న సలీముద్దీన్ గట్టు తహసీల్దార్ గా బదిలీ అయ్యారు. కలెక్టరేట్ సూపరింటెండెంట్ గా విధులు నిర్వహిస్తున్న పి.విజయ భూపాల్‌రెడ్డి ధరూర్ తహసీల్దార్ గా, ప్రస్తుతం ధరూర్ తహసీల్దార్ వెంకట్రావు ఆర్డీఓ కార్యాలయం డీఏఓగా బదిలీ అయ్యారు. కలెక్టరేట్ సూపరింటెండెంట్ గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస శర్మ జోషి మానోపాడు తహసీల్దార్ గా, మానోపాడు తహసీల్దార్ వహీదా కాటూన్ కలెక్టరేట్ ఇ సెక్షన్ సూపరింటెండెంట్ గా బదిలీ అయ్యారు. ఉండవెల్లి తహసీల్దార్ హరికృష్ణ వడ్డేపల్లి తహసీల్దార్ గా, వడ్డేపల్లి తహసీల్దార్ సి.ప్రభాకర్‌ను ఉండవెల్లి తహసీల్దార్ గా బదిలీ చేశారు.

# ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం

# అలుపెరుగక పోరాడిన ఉద్యమ కారులు

## జాతి మిమ్మల్ని ఎప్పటికి మరిచిపోదు


వనం నరసింహ మాదిగ


మదిలేటి మాదిగ


క్యాసారం శంకర్ రావు మాదిగ


పోతురాజు యాదయ్య మాదిగ


గుంటి సురేష్ మాదిగ


సోమారం రాజ్ కుమార్ మాదిగ


ననాగారి రాంచందర్ మాదిగ

### మీ పోరాట పటిమకు సెల్యూట్

బుద్వేల్, ఆగస్టు3(ప్రభాత ఉదయం): ఎస్సీ రిజర్వేషన్లను ఏబిసిడిలుగా వర్గీకరించి షెడ్యూల్డ్ కులాలలోని 59 ఉపకులాలకు సమానంగా పంచాలనే డిమాండ్ తో 1994లో మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో ఏర్పాటైన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (దండోరా) ఉద్యమంలో రాజేంద్రనగర్ నియోజక వర్గంలో మొదటి నుంచి పాల్గొన్న వారిలో కొందరి పేర్లను చెప్పుకోక తప్పదు. వారే హైదర్ గూడ కు చెందిన వనం నరసింహ మాదిగ , శంషాబాద్ కు చెందిన మదిలేటి మాదిగ, రాజేంద్రనగర్ చెందిన క్యాసారం శంకర్ రావు మాదిగ, బుద్వేల్ కు చెందిన పోతరాజు యాదయ్య మాదిగ , గుంటి సురేష్ మాదిగ, ననాగారి రాంచందర్ మాదిగ హైదర్ గూడ కు చెందిన సోమవారం రాజ్ కుమార్ మాదిగ లు. వీరే కాక మొదటి నుంచి ఉద్యమానికి అండగా నిలుస్తూ పోరాడిన వారిలో గగన్ పహాడ్ కు చెందిన తలారి అశోక్ మాదిగ, జె. నర్సింహ మాదిగ, తలారి శ్రీ రాములు మాదిగ , జోగి శేఖర్ మాదిగ, బుద్వేల్ కు చెందిన జాన్ ప్రవీణ్ మాదిగ లు కూడా ఉన్నారని చెప్పవచ్చు. పైన పేర్కొన్న వారు ముందు వరుసలో నిలబడి పోరాడగా వీరికి వెన్నుదన్నుగా అనేకమంది మాదిగ, మాదిగ ఉపకులాల బిడ్డలు ఉద్యమంలో పాలుపంచుకున్నారు.

#### జైలు కెళ్లినా మాదిగ బిడ్డలు :

ఎస్సీ రిజర్వేషన్ ల వర్గీకరణ సాధన కోసం జరిగిన పోరాటంలో గగన్ పహాడ్ కు చెందిన తలారి అశోక్, తలారి శ్రీరాములు , జే. నర్సింహ లు జైలుకు కూడా వెళ్లారు. తలారి అశోక్ ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి మొదటి నుంచి ఎంతో అండగా నిలబడ్డారు. వీరితో పాటు డాక్టర్ వి. శ్రీ రాములు, లింగని కృష్ణ మాదిగ, ఆప్పారెడ్డి గూడెం మహేందర్ మాదిగ, గోల్కొండ రాజ్ కుమార్ మాదిగ, ఏడ్లకాడి సూర్యం మాదిగ, జి సామెల్ మాదిగ, కోరని వర ప్రసాద్ మాదిగ, వీర్ల పల్లి యాదగిరి, కనకామామిడి ప్రవీణ్ కుమార్ మాదిగ, మంగాలారం శ్రీనివాస్ మాదిగ, వీర్లపల్లి నవీన్ , వీర్లపల్లి మహేష్, సీహెచ్ నర్సింహ , వై హరి చరణ్, పలుగు చెరువు మహేష్, కోరని బాల్ రాజ్, కోరని సదానంద్, బండ్ల గూడెం ప్రసాద్, కోరని క్రాంతి, కోరని మహేష్ తదితరులు ఎంతగానో సహకరించారు.

#### మంద కృష్ణ మాదిగకు బాడీగార్డ్ గా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని అన్ని గ్రామాలు వెంట ఉన్న గుంటి సురేష్ మాదిగ :

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం సాగిన ఉద్యమంలో మందకృష్ణ మాదిగ వెంట బాడీగార్డ్ గా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని అన్ని గ్రామాలలో గుంటి సురేష్ పాల్గొన్నారు.

#### 30 సంవత్సరాలు గా ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో....

హైదర్ గూడ కు చెందిన వనం నరసింహ మాదిగ, శంషాబాద్ కు చెందిన మదిలేటి మాదిగ, రాజేంద్రనగర్ కు చెందిన కె. శంకర్ రావు మాదిగ, బుద్వేల్ కు చెందిన పోతురాజు యాదయ్య మాదిగ లు 30 సంవత్సరాలుగా ఎమ్మార్పీఎస్ పోరాట ఉద్యమంలో పూర్తి స్థాయి లో పాల్గొన్నారు . బుద్వేల్ కు చెందిన పోతురాజు యాదయ్య మాదిగ ఉద్యోగం చేస్తూనే మాదిగ ఉద్యోగుల సంఘానికి రాష్ట్రస్థాయి నాయకులుగా పనిచేస్తూ, ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి వెన్నుదన్నుగా ఈనాటి వరకు అండగా నిలుస్తూనే ఉన్నారు. ఉద్యమంలో ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పటికీ నమ్మిన సిద్ధాంతం కోసం మడమ తిప్పని వారిలో క్యాసారం శంకర్ రావు మాదిగ ఒకరని చెప్పవచ్చు.

#### కలిసి వచ్చిన అనేకమంది మాదిగ సోదరులు :

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం సాగిన ఉద్యమంలో ఆ తర్వాత కాలంలో రాజేంద్రనగర్ సర్కిల్‌కు చెందిన అనేక మంది మాదిగ, మాదిగ ఉప కులాలకు చెందిన యువకులు, పెద్దలు, మహిళలు కలసి నడిచారు. వారి పేర్లు రాయాలంటే పేజీ నిండిపోతుంది. ఏది ఏమైనప్పటికీ సుప్రీంకోర్టులో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు అనుకూలంగా రావడం, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి విశ్రాంత న్యాయమూర్తి చేత ఏకసభ్య కమిషన్ వేసి నివేదిక తెప్పించుకొని మంగళవారం అసెంబ్లీలో ఎస్సీ రిజర్వేషన్లను ఏ బి సి గ్రూపులుగా వర్గీకరించి ఆమోదించడం సంతోషకరమైన దినమని గుర్తు చేసుకున్నారు . ఈ కార్యక్రమాన్ని ముందుకు నడిపించడానికి మాన్యశ్రీ మందా కృష్ణ మాదిగ ఎంతగానో కృషి చేశారన్నారు. ఎస్సీ రిజర్వేషన్లను ఏబిసిడిలుగా వర్గీకరించుకొనే అధికారం రాష్ట్రాలకు ఉందని సుప్రీంకోర్టు ఏడుగురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం తీర్పు చెప్పడం అందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎంతగానో సహకరించడం సంతోషకరమైన విషయమని మాదిగ సోదరులు గుర్తు చేసుకున్నారు. సహకరించిన ప్రధాన మంత్రి తో పాటు కేంద్ర మంత్రి జీ కిషన్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి , దామోదర్ రాజనర్సింహ, దుద్దిల్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ లకు మాదిగ జాతీ రుణపడి ఉంటుందన్నారు.


రిజిస్ట్రార్ డాక్టర్ సీ హెచ్ విద్యా సాగర్‌కు అంబేద్కర్ చిత్ర పటాన్ని బహుకరిస్తున్న ఎన్ ఎస్ యు ఐ నాయకులు

## రిజిస్ట్రార్ డాక్టర్ సీహెచ్ విద్యాసాగర్‌కు సన్మాణం

బుద్వేల్, ఫిబ్రవరి 4 (ప్రభాత ఉదయం): 14సంవత్సరాల తర్వాత ప్రొఫెసర్ జయశంకర్ తెలం గాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పూర్తి స్థాయి యూనివర్శిటీ అధికారులను అన్ని వర్గాల వారిచే వియమింపచేయడం సంతోషకరమని ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర ఉపాద్యక్షుడు రూపావత్ హరిప్రసాద్ అన్నారు. వర్శిటీ రిజిస్ట్రార్ గా నియమితులైన డాక్టర్ సీహెచ్ విద్యాసాగర్‌ను ఎన్ఎసయుఐ నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి అంబేద్కర్ చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం హరి ప్రసాద్ అధ్వర్యంలో యూనివర్శిటీ ఆఫీసర్లుగా నియమితులైన డాక్టర్ యాకాద్రీ, డాక్టర్ ఈశ్వరీ, డాక్టర్ సుజాతలతో పాటు డాక్టర్ రాజేశ్వర్ నాయక్ లను సన్మానించారు.


బుద్వేల్ రైల్వే స్టేషన్ వద్ద ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

## పట్టాల పక్కనుంచి నిర్మించిన ప్రహారీగోడ నుంచి వెళ్లడానికి దారి వదలండి

బుద్వేల్, ఫిబ్రవరి 4(ప్రభాత ఉదయం):బుద్వేల్ రైల్వే స్టేషన్ బస్తీ నుంచి రైలు పట్టాలు దాటి నేతాజీనగర్ బస్తీ వైపు ఉన్న పరిశ్రమలలో పనిచేయడానికి వీలుగా దారి వదలాలని రాజేం ద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ రైల్వేశాఖ అధికారులను కోరారు. మంగళవారం నేతాజీనగర్ బస్తీ ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి సమస్యను తీసుకువెళ్లగా ఆయన బుద్వేల్ రైల్వే స్టేషన్ ప్రాంతానికి వచ్చి రైల్వే అధికారులతో మాట్లాడారు. గత చాలా సంవత్సరాలుగా బుద్వేల్ రైల్వే స్టేషన్ బస్తీ ను ంచి రైలు పట్టాల అవతల ఉన్న నేతాజీనగర్ బస్తీకి, నేతాజీ నగర్ బస్తీ నుంచి బుద్వేల్ రైల్వే స్టేషన్ బస్తీ వైపు ప్రజలు రాకపోకలు సాగించేవారన్నారు. ఈ క్రమంలో రైలు ప్రమాదాలు జరిగి ప్రజలు మరణిస్తుండటం. రైల్వే అస్తులు అన్యాక్రాంతం అవుతుండటం గమనించిన రైల్వే శాఖ అధికారులు అటు వారు ఇటు వెళ్లకుండ ఇటు వారు అటు వెళ్ళకుండ గోడ కట్టారు. దీంతో ప్రజల రాకపోకలు ఆగిపోయాయి. ఈ విషయాన్ని స్థానిక నాయకులు ఎ.మాదవరెడ్డి, పి.సుదాకర్ గౌడ్, సీహెచ్ క్రిష్ణాగౌడ్, రాజు, చిరంజీవి తో పాటు బస్తీ ప్రజలు ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన అధికారులతో మాట్లాడి కట్టిన గోడకు మూడు ఫీట్ల దారి వదలాలని అధికారులకు సూచించారు. దానికి వారు ఒప్పుకున్న ట్టు బుద్వేల్ రైల్వే స్టేషన్ బస్తీకి చెందిన ఎ. మాధవరెడ్డి తెలిపారు.


టీవీ చూస్తూ మిఠాయిలు తినిపించుకుంటున్న మాదిగలు

## ఎస్సీ రిజర్వేషన్లను మూడు గ్రూపులుగా చేయడం సంతోషకరం

### ఎమ్మార్పీఎస్ నాయకులు

బుద్వేల్, ఫిబ్రవరి 4(ప్రభాత ఉదయం) : ఎస్సీ రిజర్వేషన్లను మూడు గ్రూపులుగా వర్గీకరిస్తు తెలంగాణ అసెంబ్లీలో తీర్మాణం చేయడం సంతోషకరమని మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర ఉ పాద్యక్షులు పోతురాజు యాదయ్య మాదిగ అన్నారు. మంగళవారం బుద్వేల్ దళిత బస్తీలో అసెంబ్లీ ప్రసారాలను టీవీ లో చూస్తు సంబరాలు చేసుకున్నారు. మిఠాయిలు పంచి పెట్టారు. ఈ సం దర్భంగా పోతురాజు యాదయ్య మాదిగ మాట్లాడుతు. ఎస్సీ రిజర్వేషన్లను ఏబీసీడీ లుగా వర్గీకరించి షెడ్యూల్డ్ కులాలలోని 59 ఉప కులాల ప్రజలకు సమాన న్యాయం చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు మంద క్రిష్ణ మాదిగ చేసిన పోరాటం ఫలించిందన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ నాయకులు నందిగామ నర్సింహ్మ మాదిగ, ననాగారి రాంచందర్ మాదిగ, జాన్ ప్రవీణ్ మాదిగ, కోరని వరప్రసాద్ మాదిగ, నరేశ్ మాదిగ, మంద హరి కుమార్ మాదిగ వినోద్ మాదిగ లు పాల్గొన్నారు.

#### మాదిగ జాతి కల ఫలించిన రోజు : ఎమ్మార్పీఎస్ నాయకులు :

ఏస్సీ రిజర్వేషన్లను మూడు గ్రూపులుగా విభజించి ఏ గ్రూపులోని 15 కులాలకు ఒక శాతం రిజర్వేషన్లు, బీ గ్రూపులోని 18 కులాలకు 9శాతం, సీ గ్రూపులోని 26 కులాలకు ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించడానికి నిర్ణయం తీసుకోవడం మాదిగ జాతి కల ఫలించిన రోజని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు వనం నర్సింహ్మ మాదిగ, మదిలేటి మాదిగ, రాష్ట్ర ఉ పాద్యక్షులు క్యాసారం శంకర్రావు మాదిగ లు అన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద. క్రిష్ణ మాదిగ నేతృత్వంలో 30 సంవత్సరాలుగా ఎస్సీ రిజర్వేషన్లను ఏబీసీడీ లుగా వర్గీకరించాలని అలుపెరగని పోరాటం చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఈ పోరాటంలో ఎంతో మంది మాదిగలు అమరులైనారని, వారందరి ఆత్మకు శాంతి కలుగాలని ప్రార్థిస్తున్నామన్నారు. ఈ విజయం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకులు మంద క్రిష్ణ మాదిగ ద్వారానే సాధ్యమైందన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు సహకరించిన ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదరం రాజనర్సింహ, దుద్దిల్ల శ్రీదర్ బాబు, పొన్నం ప్రభాకర్ లకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.


సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

## పంటల సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించిన శాస్త్రవేత్తలు

మదనాపురం, ఫిబ్రవరి 4(ప్రభాత ఉదయం) మదనాపురం మండలంలోని నరసింగాపురం , ఆత్మకూరు గ్రామాల్లో "మొక్కజొన్న, వంగ పంటల పై జీవ నియంత్రకాలచే సస్యరక్షణ" అను ప్రదర్శన క్షేత్రాలను రైతు పొలాల్లో ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శన క్షేత్రాలను, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం జీవ నియంత్రణశాల శాస్త్రవేత్త డాక్టర్ రామకృష్ణ బాబు , మదనాపురం కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త రాజేందర్ రెడ్డి , ఉద్యాన శాస్త్రవేత్త సురేష్ కుమార్ క్షేత్రస్థాయి సందర్శన చేయడం జరిగింది. ఈ సందర్భంగా రైతులతో జీవ నియంత్రణ పద్ధతులపై చర్చించడం జరిగింది. జీవ నియంత్రకాలతో వ్యవసాయంలో సస్యరక్షణ చేయడం వలన పురుగుమందులు వాడే అవసరం లేకుండా ఉంటుంది. దీని వలన ఖర్చు తగ్గుతుంది, పురుగుమందుల అవశేషాలు పంటలలో, కూరగాయల్లో ఉండకపోవటం వలన ప్రజల ఆరోగ్యం, భూమి ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఈ ప్రదర్శన పట్ల రైతులు తమ సంతోషాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో ఆత్మకూరు, నర్సింగాపురం గ్రామాలకు చెందిన రైతు సోదరులు మహమ్మద్ , బాలస్వామి ,మహేష్ తదితర రైతులు పాల్గొన్నారు.



## సేఫ్టీ లాక్‌ల వల్ల దొంగతనాలు అరికట్టవచ్చు:

### కొత్తకోట ఎస్సై ఆనంద్

కొత్తకోట, ఫిబ్రవరి 4(ప్రభాత ఉదయం) ఈ మధ్యకాలంలో వరసగా ఇండ్లలో, దేవాలయ లలో దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో కొత్తకోట మండలం కనిమేట్ట గ్రామలో వున్న వీరాంజనేయ స్వామి దేవాలయం కు మంగళవారం సేఫ్టీ లాక్ ను గ్రామస్తులతో కలిసి కొత్తకోట ఎస్సై ఆనంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, సేఫ్టీ లాక్ వల్ల దొంగతనాలు అరికట్టవచ్చునని, ఎవరికైనా సేఫ్టీ లాక్ అవసరం ఉంటే పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని మరియు , ఇళ్లకు, దేవాలయాలకు కూడా సేఫ్టీ లాక్ ను అమర్చుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో గుడి నిర్వాహకులు బ్రహ్మయ్య స్వామి ,మాజీ సర్పంచ్ గాదంరాణి పరమేష్, మాజీవార్డ్ సభ్యులు సురేష్, తిపరెడ్డి , భవనాచారి, అరవింద చారి తదితరులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్ పరిధిలో కొత్తగా 80 ట్రాన్స్ ఫార్మర్ల ఏర్పాటు : ఎస్ఈ శ్రీ రామ్మోహన్


విద్యుత్ అధికారులతో సమావేశమైన రాజేంద్రనగర్ విద్యుత్ ఎస్ ఈ రామ్మోహన్

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 4 (ప్రభాత ఉదయం) : వేసవి లో విద్యుత్ సమస్యలు లేకుండ ఉండటానికి రాజేంద్రగన్ విద్యుత్ డివిజన్ పరిధిలో ఉన్న 85 విద్యుత్ ట్రాన్స్ పార్మర్ల సామార్థ్యాన్ని పెంచడంతో పాటు మరో 80 కొత్త విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేయనున్నామని రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ ఎస్ఈ శ్రీ రామ్మోహన్ తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు నిరంతం విద్యుత్ అందిం చాలనే లక్ష్యంతో వేసవిలో ప్రత్యేక కార్యచరణతో ముందుకు వెళుతుందన్నారు. మంగళవారం శివరాంపల్లిలోని విద్యుత్ కార్యాలయంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టీ విక్రమార్క టీజీఎస్పీడీసీఎల్ సీ ఎండి ముషారఫ్ సూచనల మేరకు రాజేంద్రనగర్ డీఈ పి. రత్నాకర్ రావుల ఆద్వర్యంలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరు ఈశ్వర్ ప్రసాద్, సత్యనారాయణ, రమేశ్ లతో కలిసి వేసవి లో విద్యుత్ సరఫరాపై ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి పర్యవేక్షించేందుకు సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎస్ఈ రామ్మోహన్ మాట్లాడుతూ. వినియోగదారులు తమ ప్రాంతాలలో ఉన్న విద్యుత్ సమస్యలను ఆయా ప్రాంతాలలో గల అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించేం దుకు తగిన చర్యలు తీసుకుంటారన్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు అధికారులతో ఆయన సమావేశం ఏర్పాటు చేసి సమీక్షించారు. ప్రజల నుంచి స్వీకరిం చిన సమస్యలను అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి పరిష్కరించుకోవాలన్నారు. డివిజన్ లో గల వివిధ సెక్షన్ లలో ట్రాన్స్ ఫార్మర్ ల స్థాయిని పెంచడం, కొత్త ట్రాన్స్ ఫార్మర్ లను ఏర్పాటు చేయడం, ఇంటర్ లింకింగ్ పనులను చేపడుతున్నామన్నారు. సెక్షన్ బైఫర్ కేషన్ పనులను కూడా చేపడుతున్నట్లు అయన వివారించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ డివిజన్ విద్యుత్ డీఈ పి. రత్నాకర్ రావు మాట్లాడుతు డివిజన్ పరిధిలో రాబోయే వేసవిలో చేపట్టనున్న పనులను సమన్వయంతో అసిస్టెంట్ ఇంజనీర్లు, లైన్ ఇన్స్ పెక్టర్ లు, లైన్ మెన్ లు, సిబ్బంది సమన్వయం తో పని చేయాలనీ సూచించారు.

## మూసీలో దోమల నివారణకు యాంటీ లార్వా ఆపరేషన్



అత్తాపూర్ మూసీ వద్ద దోమల నివారణకు యాంటి లార్వా ఆపరేషన్ చేస్తున్న గ్రేటర్ ఎంతమాలజీ విభాగం సిబ్బంది



బుద్వేల్, ఫిబ్రవరి 4 (ప్రభాత ఉదయం): మూసీ పరివాహక ప్రాంతాలలో రోజురోజుకు తీవ్రమవుతున్న దోమల సమస్యను నివారించడానికి జీహెచ్ఎంసీ అధికారులు యుద్ధ ప్రాదిపదికన చర్యలు తీసుకుంటున్నారు. ఒకవైపు దోమల ఉదృత్తిని తగ్గించడానికి యాంటీ లార్వ ఆపరేషన్ చేస్తు, మరో వైపు మూసీ నదిలో గుర్రపు డెక్కను తొలగిస్తున్నారు. ఇందుకోసం మూసీ పరివాహక ప్రాంతాలలో డ్రోన్ల ద్వారా యాంటీ లార్వా ఆపరేషన్ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. చార్మినార్, బైరతాబాద్ జోన్ ఎంటమాలజీ అధికారులు, సిబ్బంది అత్తాపూర్ , లంగర్ హౌజ్ మధ్య ఉన్న మూసీ నదిలో గుర్రపు డెక్కను తొలగిస్తున్నారు. డ్రోన్ల ద్వారా దోమల లార్వాను చంపడానికి మస్కిటో అయిల్ పిచికారి చేస్తున్నట్లు ఎంటమాలజీ అధికారి నామాల శ్రీనివాస్ తెలిపారు. మస్కిటో అయిల్ బాల్స్ ను నదిలో వేసి లార్వా అభివృద్ధి చెందకుం డ ఆదిలోనే నిర్మూలించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు. దోమల నివారణకు జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది చేపడుతున్న నివారణ చర్యలకు స్థానికులు సహకరించాలని బీజేపీ రంగరెడ్డి జిల్లా కార్యదర్శి మోంద్ర కొమురయ్య కోరారు. దోమల నివారణకు ఒరీదైన డ్రోన్ టెక్నాలజీని కూడా వాడి వాడి వెంటనే స్పందిస్తున్న జీహెచ్ఎంసీ అధికారులకు అత్తాపూర్ డివిజన్లోని స్థానిక కాలనీ, అపార్ట్మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, నాయకులు శేరీ నవీన్, సిరిపాల్ రెడ్డి, దాసరి భాస్కర్, శీలం సాయిరెడ్డి, సామాజిక కార్యకర్త మ్యాడం మదుసూదన్ తదితరులు కృతజ్ఞతలు తెలియజేశారు.



## వేణుగోపాల్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన మైనంపల్లి హనుమంతరావు, కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 4 (ప్రభాత ఉదయం) కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని కొంపల్లి మున్సిపాలిటీ రాయల్ పార్క్ లో రియల్ ఎస్టేట్ వ్యాపారి వేణు గోపాల్ రెడ్డి గత నాలుగు సంవత్సరాల నుండి నివాసం ఉంటున్నారు. కొద్ది రోజుల క్రితం తన వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకొని మరణించిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్ రావు, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భూపతి రెడ్డి అతని కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మైనంపల్లి హన్మంత్ రావు, కూన శ్రీశైలం గౌడ్, భూపతి రెడ్డి మీడియాతో మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారి వేణు గోపాల్ రెడ్డి మరణం చాలా బాధాకరమన్నారు. అతని మరణం వారి కుటుంబానికి తీరని లోటు అని, ప్రభుత్వం తరుపున వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కొంపల్లి మున్సిపాల్టి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రశాంత్ గౌడ్, బొంగురి కిషోర్ రెడ్డి, కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్, గారిశే రాజు, రాజేష్ ఉప్పల, శివ కుమార్ గౌడ్, పూర్ణచందర్ రావు, శ్రీనివాస్ యాదవ్, అంజి ముదిరాజ్, శ్రీనివాస్ గౌడ్, సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## స్వర్ణ కవచ పంచలోహ శివలింగాన్ని దర్శించుకొన్న శ్రీవాసవి సేవ సమితి జాతీయ అధ్యక్షులు పూరి సురేష్

కొత్తకోట, ఫిబ్రవరి 4(ప్రభాత ఉదయం) కొత్తకోట మండలం కానాయపల్లి స్టేజి దగ్గర గల సుప్రసిద్ధమైన శైవక్షేత్రం శ్రీకోటిలింగేశ్వరదత్తదేవస్థానము దగ్గర నూతనంగా నిర్మించిన ధ్యానమందిరంలో ప్రతిష్టించిన పాదరస సహిత నవరత్నాలంకృత స్వర్ణ కవచ పంచలోహ శివలింగాన్ని మంగళవారం శ్రీ వాసవి సేవ సమితి జాతీయ అధ్యక్షులు జాతీయ కౌన్సిల్ సభ్యులు వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్, వనపర్తి రూరల్ రిపోర్టర్(మన తెలంగాణ) వనపర్తి పూరి సురేష్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కోసం ఆయన 27వేల రూపాయలు విరాళం ఆలయకమిటికి అందజేశారు . ఆలయకమిటి ప్రతినిధులు ఆయనకు శాలువా కప్పి సన్మానించారు.



## నేడు కాటేడాన్, మైలార్ పల్లి, కిస్మత్పూర్‌లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజేంద్రనగర్/బండ్లగూడ, ఫిబ్రవరి 4(ప్రభాత ఉదయం) కాటేదాన్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రవీణ్ తెలిపారు. ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు లక్ష్మి కూడా విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన లక్ష్మి గూడ గ్రామం, హౌసింగ్ బోర్డ్ కాలనీ, రాజీవ్ గృహకల్ప, వాంబే కాలనీ, బృందావన్ కాలనీ, గణేష్ నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ విద్యుత్తు సరఫరా అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

### మైలర్ దేవుపల్లిలో...

మైలార్ దేవుపల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలో బుధవారం వివిధ మరమ్మత్తుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని శిక్షణ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు. జహంగీ రాబాద్ విద్యుత్ ఫీడర్ పరిధిలో బుధవారం ఉదయం 10 నుండి 11 గంటల వరకు క్రిస్టల్ టౌన్, జహంగీరబాద్, మిల్లత్ నగర్, వాదేయి ఫర్హాన్, రహమత్ కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు క్రిస్టల్ టౌన్, రహమత్ కాలనీ, మొగల్స్ కాలేజ్, వాదేహి పహరాన్, సుభాన్ హిల్స్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### కిస్మత్ పూర్ సెక్షన్ పరిధిలో...

కిస్మత్పూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో గల ప్రాంతాలైన ఆదర్శనగర్, బైరాగి గూడ, భవాని కాలనీ, బండ్లగూడ గ్రామం, డిడి కాలనీ ప్రాంతాలలో బుధవారం ఉదయం 11:30 నుండి మధ్యాహ్నం రెండున్నర వరకు, బస్కో విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన మార్చాన్పల్లి కాలనీ, వినాయక్ నగర్, డిడి కాలనీ, కాళీ మందిర్, ఎన్ ఎఫ్ సి కాలనీ, ఆదర్శనగర్, ఎక్సైజ్ అకాడమీ, అభ్యుదయ నగర్, సంధ్యా నగర్, మాచంపల్లి ఎంక్లేవ్ ప్రాంతాలలో మధ్యాహ్నం 1:30 నుండి 2:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ఏ మల్లేష్ రాజు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

## జాతీయస్థాయిలో కరాటే పోటీలలో ప్రతిభ చాటిన లీడర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు



కొత్తకోట, ఫిబ్రవరి 4(ప్రభాత ఉదయం) జాతీయస్థాయి కరాటే పోటీలలో లీడర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థి విద్యార్థినులు ఓవరాల్ ఛాంపియన్ షిప్ సాధించారు.ఆదివారం మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని ఆర్కే ఫంక్షన్ హాల్ నిర్వహించిన 24వ జాతీయస్థాయి ఇన్విటేషన్ కరాటే ఛాంపియన్షిప్ పోటీలో నిర్వహించారు. ఈ పోటీలకు వెల్టూర్ గ్రామానికి చెందిన లీడర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ చెందిన విద్యార్థి విద్యార్థులు పాల్గొని చక్కటి ప్రతిభ కనబరిచి పథకాలు సాధించారని సీనియర్ కరాటే మాస్టర్ జి హరీష్ యాదవ్ తెలిపారు. మంగళవారం ఈ విద్యార్థులను లీడర్ స్కూల్ యాజమాన్యం ప్రిన్సిపల్ విష్ణు చైర్మన్ వెంకటేశ్వర్ విద్యార్థులను అభినందిస్తూ మెడల్స్ సర్టిఫికెట్స్ అందించడం జరిగింది .ఈ సందర్భంగా శిక్షణ ఇచ్చిన మాస్టర్ జి హరీష్ యాదవ్ ని ప్రత్యేకంగా శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యాపక బృందం కూడా విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భవిష్యత్తులో అంతర్జాతీయ కరాటే స్థాయిలలో పాల్గొని మంచి పథకాలు సాధించాలని తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని వారు కొనియాడారు .ఈ విద్యార్థులందరూ గాడ్స్ ఆన్ వారియర్స్ షోతో ఖాన్ కరాటే డు ఇండియా ఆధ్వర్యంలో శిక్షణ తీసుకుంటున్నారు .ఈ సందర్భంగా స్కూల్ ఆవరణలో క్లబ్బు ఫౌండర్ అబ్దుల్ నబీ , మాస్టర్ అంజీలను శాలువాలతో సన్మానించడం జరిగింది అని సీనియర్ కరాటే మాస్టర్ డిప్యూటీ ఫౌండర్ జి హరీష్ యాదవ్ తెలిపారు.

## బీమా రంగంలో విదేశీ పెట్టుబడుల పెంపుదల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి: పిట్టల రవీందర్

హైదరాబాద్, ఫిబ్రవరి 4(ప్రభాత ఉదయం) భీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి పరిమితి పెంపుదల నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సిటీ 15వ బ్రాంచ్ అధ్యక్షుడు పిట్టల రవీందర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బీమా ఉద్యోగులంతా ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పిట్టల రవీందర్ మాట్లాడుతూ... ప్రస్తుత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలలో ప్రతిపాదించనున్న బీమా చట్ట సవరణ బిల్లు ను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. బీమా పరిశ్రమలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల అవసరం ఏమాత్రం లేదన్నారు.కానీ కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ బీమా రంగంలో విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తుందని ఆరోపించారు. 1999 నుండి నేటి వరకు కేంద్ర ప్రభుత్వం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానిస్తుందని తద్వారా బీమా పరిశ్రమ పూర్తిగా దెబ్బతింటుందన్నారు. భీమా రంగంపై ఆధారపడ్డ కుటుంబాలు సైతం రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యక్ష పెట్టుబడి విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉద్యోగస్తులు పద్మావతి, వరలక్ష్మి, రఘురాం, సుబ్బారావు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ చేసిన ఎస్ఈ శ్రీరామ్మోహన్



డైరీ ఆవిష్కరిస్తున్న ఎస్ ఈ శ్రీరామ్మోహన్



పిఓ కు డైరీ అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

మెహదీపట్నం, ఫిబ్రవరి 4(ప్రభాత ఉదయం) విద్యుత్ ఉద్యోగుల ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీ ని రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ ఎస్ ఈ శ్రీరామ్మోహన్ ఆవిష్కరించారు. అసోసియేషన్ రీజినల్ ప్రెసిడెంట్ జైపాల్, సెక్రటరీ యాదయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డి ఈ (టెక్నికల్) ఎం శివశంకర్, ఎస్ ఏ ఓ లోకేశ్వరయ్య, ఏవో చంద్రశేఖర్ , అసోసియేషన్ ప్రతినిధులు రాజు, సురేష్ ,అర్జున్, వెంకటేష్ ,మహేష్, సంపత్, నరసింహ రాజు ,పరశురాము లు పాల్గొన్నారు.



డైరీ ఆవిష్కరిస్తున్న డి ఈ రత్నాకర్ రావు

## శ్రీ సుందరగిరి పరమేశ్వర స్వామి సన్నిధిలో అర్ధమండల శివదీక్ష స్వీకరించిన స్వాములు



శివ మాలధార భక్తులకు మెడలో రుద్రాక్ష మాల వేస్తున్న అర్చకులు సంపత్ కుమార్



శివ మాల ధారణతో భక్తులు

కొత్తకోట, ఫిబ్రవరి 4(ప్రభాత ఉదయం) కొత్తకోట మండలంలోని అప్పరాల గ్రామంలో గల శ్రీ సుందరగిరి పరమేశ్వర స్వామి సన్నిధానంలో రథసప్తమి సందర్భంగా రామకృష్ణ పురం గ్రామానికి చెందిన భక్తులు అర్ధమండల శివదీక్ష స్వీకరించారు. శివమాల ధరించడానికి వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు సంపత్ కుమార్ స్వామి భక్తుల మెడలో రుద్రాక్ష మాల వేసి దీక్షను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సంపత్ కుమార్ స్వామి, శివ స్వాములు పాల్గొన్నారు.



## గట్టు తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన సలీముద్దీన్

గద్వాల, ఫిబ్రవరి 04(ప్రభాత ఉదయం) గట్టు మండలం తహసీల్దార్ గా సలీముద్దీన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలో భాగంగా జిల్లా కలెక్టరేట్ లో ని ఇ సెక్షన్ సూపరింటెండెంట్ గా పని చేస్తున్న సలీముద్దీన్ గట్టు తహసీల్దార్ గా బదిలీపై వచ్చినట్లు పేర్కొన్నారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఇంచార్జి తహసీల్దార్ వీరభద్రప్ప ఆయనకు బాధ్యతలు అప్పగించారు. అనంతరం నూతన తహసీల్దార్‌కు రెవెన్యూ, కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

## బీఆర్ఎస్ పార్టీ విప్‌గా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 4 (ప్రభాత ఉదయం) తెలంగాణ శాసనసభలో బీఆర్ఎస్ పార్టీ విప్‌గా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ను ప్రకటించిన సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద్ పార్టీ అధినేత, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ, "నాపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ అధినేత కేసీఆర్ కి, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ బాధ్యతను పూర్తి నిబద్ధతతో, పార్టీ ఆదేశాలను పాటిస్తూ, శాసనసభలో పార్టీ ప్రతిష్టను మరింత పెంచేలా పని చేస్తాను" అని పేర్కొన్నారు. అలాగే, పార్టీ నాయకత్వం తనకు ఇచ్చిన ఈ అవకాశాన్ని సమర్థవంతంగా వినియోగించుకుని, పార్టీ అభివృద్ధికి, ప్రజల ఆకాంక్షల నెరవేర్చేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608